క్లుప్తంగా

ఆడికృత్తికకు ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్ : ఈ నెల 9, 10వ తేదీలలో ఆడి కృత్తికను పురస్కరించుకుని పాకాలలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి గుడికి పీలేరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు – పాకాల మధ్య 4, కల్లూరు – పాకాల 2, పీలేరు – సదుం 2 బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు రాజీనామా

కలకడ : తెలుగుదేశం పార్టీకి ఆ పార్టీ కలకడ మండలశాఖ రైతు సంఘం అధ్యక్షుడు బరకం వెంకటప్రసాద్‌రెడ్డి రాజీనామా చేశారు. మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన వెంకటప్రసాద్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆయనకు టీడీపీ మండల తెలుగు రైతుసంఘం అధ్యక్ష పదవి ఇచ్చింది. అయితే ఆదివారం తెలుగుదేశం పార్టీ రైతు సంఘం అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

లోకాయుక్తకు వీడ్కోలు

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదివారం మండలంలోని టి.సదుం పంచాయతీలోని చెన్నరాయునిపల్లికి విచ్చేశారు. అనంతరం విధి నిర్వహణలో భాగంగా ఆయన రోడ్డు మార్గంలో పోలీస్ ఎస్కార్ట్ ద్వారా హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. మండల రెవెన్యూ సిబ్బంది, పోలీసులు లోకాయుక్తకు ఘనంగా వీడ్కోలు పలికారు.

పెద్ద యల్లమ్మ ఆలయంలో అగ్నిప్రమాదం

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ చీనేపల్లెలో ఉన్న పెద్దయల్లమ్మ ఆలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. చీనేపల్లెలో చిన్నక్కమ్మ పెద్దక్కమ్మ ఆలయాల సముదాయంలో ఉన్న పెద్ద యల్లమ్మ ఆలయంలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన గ్రామస్తులు ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ప్రమాదంతో అమ్మవారి చీరలు, వస్తు సామగ్రి కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరయ్య, నాయకులు రెడ్డెప్పరెడ్డి తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉచిత దంత వైద్యశిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రముఖ దంత వైద్య నిపుణులు భవానీ దంతవైద్య చికిత్స చేశారు. సుమారు 70 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దంత చికిత్స చేసి సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, నాయకులు శేఖర్, ఆదినారాయణ, బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డిని సన్మానిస్తున్న షీ సంస్థ నిర్వాహకులు

పీలేరురూరల్ : యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక షీ దివ్య యోగా విద్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీ సంస్థ నిర్వాహకులు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ, డాక్టర్ రాయల సుధాకర్ సేవలు అభినందనీయమన్నారు. నిత్యం యోగా తరగతులు నిర్వహించడం, యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సుపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ఈ అవకాశాన్ని పీలేరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జి.వి. శ్రీనాథరెడ్డిని షీ సంస్థ నిర్వాహకులు దుశ్శాలువతో సత్కరించారు.

రెడ్డి కమ్యూనిటీ ప్రధాన కార్యదర్శిగా హనుమంతురెడ్డి



మదనపల్లె : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ మండల ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి హనుమంతురెడ్డిని నియమిస్తూ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు వై.సురేంద్రరెడ్డి ఆదివారం నియామకపత్రం అందజేశారు. తదుపరి ఉత్తర్వులు అందేవరకు హనుమంతురెడ్డి పదవిలో కొనసాగుతారని తెలిపారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీలో అందరినీ కలుపుకుని, ఇతర రెడ్డిసంఘాలతో సమన్వయమై క్రమశిక్షణతో ముందుకెళ్లి జాతి సమస్యలపై అవగాహన పెంచుకుని కమ్యూనిటీ అభివృద్ధి కోసం కృషి చేయాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా హనుమంతురెడ్డి మాట్లాడుతూ..రెడ్డిజాతి సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి తనవంతు చేయూతనందిస్తానన్నారు.

దిగివస్తున్న టమాటా ధరలు

- మార్కెట్లో కిలో టమాటా రూ.90 నుంచి రూ.100
- ఆరు రోజులుగా ధరలు తగ్గుముఖం
- ఉమ్మడి అనంతపురం జిల్లా టమటాలు జిల్లాకు రాక
- మండీలలో 25 శాతం మేరకు పెరిగిన టమాటాల స్టాకు



ఎగుమతికి సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ: మార్కెట్లో టమాటా ధరలు సగానికి పైగా తగ్గాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా అత్యధికంగా రూ.90 నుంచి రూ.100 వరకు ధరలు పలుకుతున్నాయి. ఆరురోజులుగా మార్కెట్లో టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయి. మన జిల్లాకు పక్కనే ఉన్న ఉమ్మడి అనంతపురం (పుట్టపర్తి, అనంతరపుం) జిల్లాల నుంచి టమాటాల దిగుబడి ప్రారంభం కావడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. రెండు జిల్లాల నుంచి టామాటాలు ఇక్కడికి వస్తున్నాయి. దీంతో మార్కెట్లో టమాటాల స్టాకు 25శాతం మేరకు పెరగడంతో ధరలు తగ్గుముఖం పడుతుండడం గమనార్హం.

రూ.5000 నుంచి 2500కు తగ్గిన ధరలు

పదిహేనురోజుల కిందట 25 కేజిల టమాటా క్రీట్ రూ. 5000 నుంచి రూ.5200 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం ఆరురోజులుగా మార్కెట్లో టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయి. రోజు రోజుకు ధరలు ఆకాశం నుంచి దిగివచ్చి ప్రస్తుతం సగానిపైగా ధరలు మార్కెట్లో తగ్గిపోయాయి. మార్కెట్లో ఆదివారం నిర్వహించిన వేలం పాటల్లో మొదటిరకం టమాటాకిలో రూ90 నుంచి రూ.100, రెండోరకం కిలోరూ72, మూడో రకం రూ.55 వరకు ధరలు పలికాయి. 25కేజిల టమాటా క్రీట్ ధర రూ.2500 వరకు ధరలు పలకడం గమనార్హం.

అనంతరపుం జిల్లా నుంచి వస్తున్న టమాటాలు:

ఉమ్మడి అనంతరపురం (అనంతరపురం. పుట్టపర్తి) జిల్లాల నుంచి ఆరు రోజులుగా జిల్లాలోని టమాటా మండీలకు కాయలు వస్తున్నాయి. ఈసీజన్‌లో అక్కడి రైతులు విస్తారంగా టమాటా పంట సాగు చేశారు. ప్రస్తుతం సదరు రెండు జిల్లాల్లో టమాటా పంట దిగుబడి ప్రారంభమయ్యింది. దీంతో అక్కడి రైతులు మన జిల్లాలోని ములకలచెరువు, అంగళ్లు, మదనపల్లె, గుర్రంకొండ మార్కెట్ యార్డులకు టమాటాలు తీసుకొస్తున్నారు. దీంతో నెలరోజులుగా బంగారాన్ని తలపించిన టమాటా ధరలు ప్రస్తుం తగ్గుతూ వస్తున్నాయి.

టమాటాల స్టాకు, ధరల వివరాలు ఇలా..

తేదీ	స్టాకు (టన్నుల్లో)	ధర (25కేజీలక్రీట్)
ఆగస్టు 01	1452	రూ.3750
02	1485	రూ.3500
03	1521	రూ.3250
04	1565	రూ.3000
05	1587	రూ.2250
06	1594	రూ.2500

25 శాతం పెరిగిన టమాటాల స్టాకు

జిల్లాలోని అన్ని మార్కెట్‌యార్డుల పరిధిలోని టమాటా మండీల్లో టమాటాల స్టాకు పెరిగింది. హదిహేను రోజుల క్రితం జిల్లా మొత్తం మీద 1029 నుంచి1050 టన్నుల లోపే టమాటాలు మండీలకు వచ్చాయి. గత ఆరురోజులుగా బయట జిల్లాల నుంచి టమాటాల మన జిల్లాకు రావడం ప్రారంభమయ్యింది. దీంతో ప్రస్తుతం 1452 నుంచి 1594 టన్నుల వరకుటమాటాల స్టాకు మండీలకు వస్తున్నాయి. ఈలెక్కన గత హదిహేను రోజుల కిందట స్టాకుతో పోల్చితే అదనంగా 25 శాతానికి పైగా టామటాల స్టాకు మండీల్లో పెరిగింది.

సామాన్యుడికి అందుబాటులో ధరలు

నెల రోజుల క్రితం సామాన్యులకు చుక్కలు చూపించిన టమాటా ధరలు ప్రస్తుతం ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. మార్కెట్లో టమాటా ధరలు రూ. 200 వరకు పలకడంతో ప్రజలు టమాటాల కోసం నానా కష్టాలు పడ్డారు. చివరకు ఎన్నడూ లేనంతగా ప్రభుత్వం చొరవ తీసుకొని సబ్సిడీపై మార్కెట్ కమిటీల ద్వారా ప్రజకు కిలో రూ.50కే అందించారు. అయితే ఆ పరిస్థితి నుంచి తేరుకొని ప్రస్తుతం టమాటా ధరలు దిగిరావడంతో సామాన్య ప్రజలు ఊపిరి పీల్చుకొంటున్నారు.

బయట రాష్ట్రాలకు ఎగుమతి

జిల్లాలో టమాటా పంట దిగుబడులు తగ్గుముఖం పట్టడంతో కొద్దిరోజులుగా బయట రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. గత ఆరురోజులుగా మండీలల్లో టమాటా స్టాకు పెరుగుతండడంతో ప్రస్తుతం బయట రాష్ట్రాలకు మళ్లీ ఎగుమతులు ప్రారంభమయ్యాయి. మన జిల్లా నుంచి మార్కాపురం, నరసరావుపేట, విజయవాడ, గుంటూరుతో పాటు తమిళనాడు, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఇక్కడి టమాటాలను ఎగుమతి చేస్తున్నారు. బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులు మన జిల్లాలోనే మకాం వేసి ఇక్కడి మార్కెట్లలో టమాటాలను కొనుగోలు చేసి ప్రస్తుతం ప్రతిరోజూ 35 నుంచి40 లారీ లోడ్ల టమటాలు బయట రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

బయట జిల్లాల నుంచి టమాటాలు



ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి ప్రస్తుతం జిల్లాలోని పలు టమాటా మండీలకు కాయలు వస్తున్నాయి. ఆరు రోజులుగా ఆ జిల్లాల్లో టమాట పంట దిగుబడి ప్రారంభమయ్యింది. అక్కడి రైతులు టమాటాలను ఇక్కడి మండీలకు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం గతంలో కంటే 25శాతం మేరకు అదనంగా టమాటాల స్టాకు మన జిల్లాలోని మండీలకు వస్తోంది. దీంతో టమాటా ధరలు గతంతో పోల్చితే సగానికిపైగా తగ్గాయి. ప్రస్తుతం కిలో టమాటా రూ. 100లోపే ధరలు పలుకుతున్నాయి.

-జగదీష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

– గడప గడప సమస్యలపై ఎమ్మెల్యే స్పందన



బాలినాయునిపల్లెలో ఆక్రమణలు తొలగించిన ప్రభుత్వ స్థలం వద్ద రెవెన్యూ అధికారులు

నిమ్మనపల్లె : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్పందించారు. సమస్య పరిష్కారానికి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ బాలినాయునిపల్లెలో స్థానికుడైన చాకలిరఘు సర్వే నెం.810/13లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాన్ని పూర్తిచేసి పాలకేంద్రం నిర్వహిస్తున్నారు. అయితే సదరు స్థలంలో విద్యార్థులకు అనుకూలంగా బస్‌షెల్టర్ నిర్మించాలని గ్రామస్తులు గత కొన్నేళ్లుగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అందులో భాగంగా రెవెన్యూ అధికారులు స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తికి నోటీసులు అందజేసి ఆక్రమణలు తొలగించాల్సిందిగా ఆదేశించినా అతడు నిర్లక్ష్యం కనపరచాడు. ఇదే సమస్యపై స్థానికులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోనూ ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బస్‌షెల్టర్ సమస్యను పరిష్కరించాల్సిందిగా ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే తహసీల్దార్ సి.ఆర్.మంజులను ఆక్రమణను తొలగించి స్థలాన్ని పంచాయతీ అధికారులకు అప్పగించాల్సిందిగా ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది, ఎస్‌ఐలు రామకృష్ణ, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు.

గద్దర్ మృతి తీరనిలోటు



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫోర్సు నరసింహులు తదితరులు

తంబళ్లపల్లె: ప్రజాయుద్ధ నౌక, విప్లవకారుడు గద్దర్ మృతి పీడిత వార్గలకు తీరనిలోటని ఫోర్సు నరసింహులు అన్నారు. ఆదివారం గద్దర్ మృతి సందర్భంగా రాగిమాను వద్ద ఆయన చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులర్పించారు. ఆయన జీవితకాలం పీడిత వర్గాల విముక్తి కోసం మాట,పాటలతో ప్రజలను చైతన్యపరిచి అహర్నిశలు కృషి చేశారన్నారు. అదే విధంగా జననాట్య మండలి మాజీ సభ్యులు, అభిమానులు, వలికి శ్రీరాములూ,కిషోర్, సుదర్శన్, శివన్న, శంకర్‌రెడ్డి, మదన్, క్రిష్ణంరాజులు విప్లవ జోహార్లు అర్పించారు. సమాజంలో పీడిత వర్గాలను విముక్తి పరిచి వారి అభివృద్ధికై చేసిన కృషి మరుపురానిదని కొనియాడారు.

గద్దర్ మృతికి సంతాపం

బి.కొత్తకోట: గద్దర్ మృతికి ఆయన అభిమానులు వలిపి శ్రీరాములు, పాదం శివన్న, గంధం కిషోర్, సుదర్శన్, శంకర్‌రెడ్డి, మదన్, కృష్ణంరాజు సంతాపం వ్యక్తం చేశారు. నక్సలైట్ ఉద్యమంలో కీలక స్థానం, చరిత్ర సృష్టించిన తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి ఉమ్మడి రాష్ట్రస్థాయి నక్సల్ నేతలు తయారు కావడం వెనుక గద్దర్ పాట ప్రభావం ఉందని మాజీ మావోయిస్టులు చెబుతుంటారు. నక్సలైట్ ఉద్యమంలో తంబళ్లపల్లె చరిత్రను లిఖించడమేకాక చరిత్రలో నిలిచిపోయే ఘటనలు జరిగాయి. గద్దర్ మృతితో గతంలో ఆయన పర్యటనలు, ఆయనను కలిసిన సందర్భాలను పలువురు గుర్తుకు తెచ్చుకొంటున్నారు. గద్దర్ 1984, 1986లో మదనపల్లె బీటీ కళాశాలలో జరిగిన రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ సమావేశాలకు హాజరయ్యారు. తర్వాత 1990లో మదనపల్లె మిషన్‌కాంపౌండ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరయ్యారు. సీటీఎంలోని స్పిన్నింగ్‌మిల్లును సందర్శించి కార్మికుల పక్షాన సమస్యలపై అండగా నిలిచారు. ఆయన పర్యటన సమయాల్లో తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ప్రముఖులకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించడం అప్పట్లో తీవ్ర సంచలనమైంది.

ఆ ప్రముఖుల్లో ఒకరు హత్యకు గురికాగా మరోక ప్రముఖుడు తన కార్యకలాపాలను రహస్యంగా సాగించాల్సి వచ్చింది.

చంద్రబాబుకు ఓటమి భయం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

వాల్మీకిపురం : టీడీపీ నేత చంద్రబాబునాయుడు వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో రెచ్చగొట్టే వ్యాఖ్యాలు చేస్తూ అల్లర్లు సృష్టిస్తున్నారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు, అంగళ్లలో జరిగిన విధ్వంసానికి, పోలీసులు, ప్రజలపై జరిగిన దాడులకు చంద్రబాబునాయుడే కారణమని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేశానని గొప్పలు చెప్పుకునే ఆయన జలాశయాల పరిశీలన పేరుతో పర్యటించి రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఘర్షణలకు ఆజ్యం పోషారని తెలిపారు. వ్యవసాయం దండగ అంటూ రైతుల పట్ల నిర్లక్ష్యం వహించిన చంద్రబాబు నేడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ ఆయన చెప్పే మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. నిరంతరం ప్రజలకోసం పని చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. విధ్వంసకాండకు కారకుడైన చంద్రబాబుపై ఏ1 ముద్దాయిగా చేర్చి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వెంకటరమణ, సర్పంచ్ మునిభాస్కర, నాయకలు ఆనంద్, రవి పాల్గొన్నారు.

అంగళ్లు ఘటనపై టీడీపీ నాయకులపై కేసు

కురబలకోట: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో రెండు రోజుల క్రితం కురబలకోట మండలంలోని అంగళ్లులో చోటు చేసుకున్న ఘటనపై ముదివేడు పోలీసులు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం తెలిపారు. వీరిలో మాజీ మంత్రి, పలమనేరు టీడీపీ ఇన్‌చార్జి అమరనాథ రెడ్డి, పీలేరు ఇన్‌చార్జి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన బాబు, ఆ పార్టీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి తదితరులు ఉన్నట్లు తెలిపారు. బెదిరించడం భయభ్రాంతులకు గురి చేయడం లాంటి సంఘటనపై వీరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇదిలా ఉండగా అంగళ్లుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుర్రాల అర్జున్ రెడ్డి కూడా తనపై జరిగిన దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు . సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటకాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

చుండూరు దళిత మృతవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పీలేరు : గుంటూరు జిల్లా చుండూరులో 32 ఏళ్ల క్రితం ఊచకోతకు గురైన దళిత మృతవీరులకు పీలేరు ప్రజా సంఘాల నాయకులు ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దళితులు అణచివేతకు గురవుతున్నారని తెలిపారు. దళితులపై తరచూ దాడులు, అత్యాచారాలు, కుల దూషణలు, అంటరానితనం లాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ధరణికుమార్, గట్టప్ప, జెట్టిమల్లికార్జున పాలకుంట శ్రీనివాసులు, రాజేశ్వరి, యల్లప్ప, భానుప్రకాష్, గుండ్లూరు సదాశివ, వెంకటరామయ్య, దామోదర్, ఆనంద్, రవీంద్ర, రమేష్‌నాయక్, లోకనాథం, ప్రసాద్, ద్వారక పాల్గొన్నారు.

మద్దెమ్మదేవతకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ తిరుమలగుట్టపల్లె సమీపంలో వెలసిన శ్రీమద్దెమ్మదేవత ఆలయంలో నలపరెడ్డి దాయాదులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలవేల్పుదేవత మద్దెమ్మ ఆలయంలో దాయాదులు అందరూ ప్రత్యేక పూజలు,అభిషేకాలతో పూజారి మధుస్వామి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నలపరెడ్డిదాయాదులు అందరూ సమావేశమై ఆలయ అభివృద్ధి, దేవర్ల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నలపరెడ్డి దాయాదులు రామలింగారెడ్డి, తిప్పారెడ్డి, నాగమల్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు అభయం

- అర్బన్ హెల్త్ సెంటర్లు అమోఘం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



రామారావుకాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పట్టణ ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు అభయమిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలను అందిస్తున్నాయి. ఇక్కడ వైద్యుడుతో పాటు స్టాఫ్ నర్సులు ఇద్దరు, ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్, డిఈఓ, అటెండర్ ఉంటారు.

టీడీపీ హయాంలో అస్తవ్యస్తం

టీడీపీ పాలనలో మదనపల్లె పట్టణంలో కేవలం ఒకటి మాత్రమే పట్టణ ఆరోగ్య కేంద్రం ఉండేది.అప్పుడు ఈ కేంద్రంలో మందుల కొరత, వైద్య పరీక్షలు నామమాత్రంగా ఉండేది. ఇది చాలా మంది అవసరాలు కూడా తీర్చలేదు. దీంతో ప్రజలు చాలా మంది ఇబ్బందులు పడ్డారు.

ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణ స్వీకారం చేశాక వైద్య రంగంలో కొత్త పుంతలు తొక్కింది. గతంలో ఒక్కటే ఉన్న ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం ఐదుకు చేరింది. అందులో రెండు భవనాలు పూర్తి చేసుకుని వైద్య సేవలు అందిస్తున్నారు. మరో మూడు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భవనాలు లేని మూడు కేంద్రాలోల అద్దె భవనాల్లో సేవలు అందిస్తున్నారు.

172 రకాల మందులు

ఈ ఆసుపత్రుల్లో ప్రాథమికంగా షుగర్, బీపీ, జ్వరాలు, వాంతులు, విరేచనాలు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఇక్కడ 64 రకాల వైద్యసేవలతో పాటు 172 రకాల మందులు లభిస్తాయి. ఫలితంగా ఈ ఆసుపత్రులకు ప్రజల నుంచి ఆదరణ అద్భుతంగా లభిస్తోంది. ఒక ఆస్పత్రికి ఒక రోజుకు 40 నుంచి 100 వరకు ఔట్‌పేషెంట్స్ వస్తున్నారు. ఈ ఆస్పత్రులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి. ఈ ఆసుపత్రుల్లో లభిస్తున్న వైద్య సేవల పట్ల మదనపల్లె పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య సేవలు బాగున్నాయి.



నాపేరు సలీమ్‌బాషా. దేవళంవీధిలో నివాసమున్నా. నాకు బీపీ, షుగర్ ఉంది. వైద్య కోసం ఇక్కడి వస్తున్నా. అన్ని పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే ఇక్కడ వైద్యులు ఆరోగ్యకరమైన వైద్యం అందిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వైద్య సేవలు మరిచిపోలేం. ఆయనకు రుణపడి ఉంటాం.

సద్వినియోగం చేసుకోవాలి



పట్టణ ఆరోగ్య కేంద్రాల మంచి వైద్యం లభిస్తోంది. స్థానికులు ఇక్కడ లభించే వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది.

-డాక్టర్ సులేమాన్, వైద్యులు, దొంతివీధి

అన్ని రకాలు మందులు ఉచితం



నా పేరు నవాజ్‌బాషా.సైదాపేటలో నివాసమున్నా. నాకు ఆరోగ్యం బాగలేకపోతే ఇక్కడి వస్తాను. కార్పొరేట్ ఆస్పతిలో చేసే వైద్యం ఇక్కడ చేస్తున్నారు. అన్ని రకాల మందులు ఉచితంగా ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం కోసం ఆయన చేస్తున్న సేవలు గొప్పవి.